సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 24 । అక్టోబర్ । 2024



చేప 'ధర'హాసం కొందరికే
ఇటీవల చేపధర పెరగడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పెరిగిన ధర కొందరికి మాత్రమే ఉపయోగపడడంతో మిగిలిన రైతులు నష్టపోయారు. 8లో ▸



అనుమానాస్పద స్థితిలో మృతి
చిత్తూరు జిల్లా వాసి ఏలూరు జిల్లా ముసునూరు మండలంలోని కాట్రేనిపాడు శివార్లలో అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. 8లో ▸



రూ.72 లక్షల సైబర్ మోసం
భీమవరం పట్టణానికి చెందిన ఒక వైద్యుడికి సైబర్ నేరగాళ్లు వల వేసి రూ.72 లక్షలు కాజేశారు. మోసపోయానని గుర్తించి ఆయన పోలీసులను ఆశ్రయించాడు. 8లో ▸

పల్లెల్లో పడకేసిన ప్రగతి

- సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ నిర్మాణాలకు బ్రేక్
- గ్రామాల్లోనే సమస్యల పరిష్కారానికి సచివాలయాలు
- రైతుల కోసం ఆర్బీకేలు.. ప్రజారోగ్యానికి హెల్త్ క్లినిక్‌లు
- కూటమి సర్కారు నిర్లక్ష్యంతో ముందుకు సాగని నిర్మాణాలు


పెనుగొండలో నిలిచిన సచివాలయం, ఆర్బీకే నిర్మాణాలు


కె.కుముదవల్లిలో ఆగిపోయిన హెల్త్ క్లినిక్ భవనం

సాక్షి, భీమవరం: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. మండల, జిల్లా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లతో పాలనను పల్లెకు చేర్చింది. వాటి కోసం ఊరూరా ప్రత్యేక భవన నిర్మాణాలు చేపట్టింది. 70 శాతం భవనాలు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చింది. మిగిలినవి పూర్తిచేసే దిశగా కూటమి సర్కారు చొరవ చూపక అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. గతంలో చాలావరకు పంచాయతీల వద్ద సెక్రటరీ, బిల్ కలెక్టర్, అటెండర్ మాత్రమే ఉండేవారు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు వ్యయ ప్రయాసలకోర్చి మండల కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తెచ్చి ఒక్కో సచివాలయంలో 11 శాఖల ఉద్యోగులను నియమించింది. 35 ప్రభుత్వ శాఖలకు చెందిన 500 పైగా సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఒక్కో సచివాలయానికి రూ. 40 లక్షలు చొప్పున జిల్లాలో 353 భవన నిర్మాణాలకు సుమారు రూ.141.2 కోట్లు మంజూరు చేసింది. వీటిలో 270 భవనాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

అన్నదాతల అవస్థలకు చెక్‌పెడుతూ ఆర్బీకేల ద్వారా సాగులో సరికొత్త అధ్యాయానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విత్తు నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకు ఇవి అన్నదాతలకు అడుగడుగునా అండయ్యాయి. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులతో పాటు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, విపత్తుల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పరిహారం అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. జిల్లాలో రూ.65 కోట్ల వ్యయంతో 298 భవన నిర్మాణాలు చేపట్టగా ఇప్పటికే వీటిలో 211 భవనాలు వినియోగంలోకి వచ్చి రైతులకు సేవలందిస్తున్నాయి. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవల కోసం ఆధునిక వసతులతో హెల్త్ క్లినిక్‌ల నిర్మించింది. ఒక్కో హెల్త్ క్లినిక్‌కు సుమారు రూ.25 లక్షల చొప్పున జిల్లాలోని 214 భవనాలకు రూ.53.5 కోట్లు మంజూరు చేసింది. 96 భవనాలు పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చింది.


వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన నరసాపురం రూరల్ సీతారాంపురంలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్‌క్లినిక్

ముందుకు సాగని పనులు
గత ప్రభుత్వంలో ఆయా భవన నిర్మాణాలు శరవేగంగా సాగాయి. 83 సచివాలయ భవనాలు, 87 ఆర్బీకేలు, 118 హెల్త్ క్లినిక్‌లు మిగిలి ఉన్నాయి. వీటిలో 18 సచివాలయ, 16 ఆర్బీకే, 14 హెల్త్ క్లినిక్‌ల పనులు దాదాపు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. వీటి నిర్మాణాలు పూర్తిచేసే దిశగా ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి ముందుకు సాగడం లేదు. త్వరితగతిన వీటిని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయ భవనాలు

నియోజకవర్గం	మంజూరు	నిర్మాణం పూర్తి	అసంపూర్తిగా ఉన్నవి
ఆచంట	42	26	16
పాలకొల్లు	54	41	13
నరసాపురం	40	39	1
తాడేపల్లిగూడెం	47	38	9
తణుకు	50	39	11
భీమవరం	58	47	11
ఉండి	62	40	22

ఆర్బీకే భవనాలు

నియోజకవర్గం	మంజూరు	నిర్మాణం పూర్తి	అసంపూర్తిగా ఉన్నవి
ఆచంట	35	19	16
పాలకొల్లు	53	39	14
నరసాపురం	39	35	4
తాడేపల్లిగూడెం	43	35	8
తణుకు	49	31	18
భీమవరం	41	28	13
ఉండి	38	24	14

హెల్త్ క్లినిక్ భవనాలు

నియోజకవర్గం	మంజూరు	నిర్మాణం పూర్తి	అసంపూర్తిగా ఉన్నవి
ఆచంట	28	15	13
పాలకొల్లు	40	12	28
నరసాపురం	33	29	4
తాడేపల్లిగూడెం	31	14	17
తణుకు	32	9	23
భీమవరం	22	5	17
ఉండి	28	12	16

న్యూస్‌రీల్

పశువుల కట్టడికి చర్యలు


తణుకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆటలాడుతున్న దృశ్యం

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'పశువుల దొడ్డిగా క్రీడా ప్రాంగణం' పేరుతో ఈ నెల 22న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తణుకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పశువులు తిష్టవేయడంతో విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు ఇబ్బందులు పడుతున్నారని, పశు యజమానులు తమ పశువులను ప్రతిరోజూ క్రీడా ప్రాంగణంలో విడిచిపెడుతున్నారనే కథనంతో సాక్షిలో ప్రచురితం కాగా మున్సిపల్, విద్యా శాఖ అధికారులు స్పందించి పశువులను పాఠశాల క్రీడా ప్రాంగణంలోకి తోలకుండా చర్యలు తీసుకున్నారు.

మద్యం దుకాణాలు తొలగించాలంటూ నిరసన


పెనుగొండలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

పెనుగొండ: పెనుగొండ మినర్వా రోడ్డులో మద్యం దుకాణాలు తొలగించాలంటూ మహిళలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వీటి వల్ల మహిళలు, పిల్లలు అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. ఇళ్ల మధ్య దుకాణాలు ఏర్పాటు చేయకూడదని పంచాయతీ తీర్మానం చేసినా విరుద్ధంగా ఏర్పాటు చేశారని ఆరోపించారు.

సరస్వతి దేవి విగ్రహాన్ని తొలగించారంటూ ధర్నా


ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

భీమవరం: భీమవరం పట్టణం సుంకర పద్దయ్య వీధిలోని చంద్రరావు మున్సిపల్ పాఠశాల ఆవరణలోని సరస్వతి దేవి విగ్రహాన్ని అక్రమంగా తొలగించారంటూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం విభాగ్ కన్వీనర్ కాయిత డిన్ను చందు మాట్లాడుతూ పాఠశాల ఆవరణలోని సరస్వతి దేవి విగ్రహాన్ని తొలగించడం అన్యాయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంజిబాబును కలిసి వినతిపత్రం అందచేశారు.

26న జాబ్ మేళా

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. జాబ్‌మేళాలో స్టీల్ టిప్స్ వీల్స్ ఇండియా, ఏషియన్ ఆటో పార్ట్స్, ముత్తూట్ ఫైనాన్స్, నవత ట్రాన్స్‌పోర్ట్, అపోలో ఫార్మసీ తదితర 16 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదివే విద్యార్థులు, డిగ్రీ పూర్తి చేసిన వారు పాల్గొనవచ్చన్నారు. బయో డేటాతో పాటు సర్టిఫికెట్‌లు, జిరాక్స్ కాపీలతో శనివారం ఉదయం 8.30 గంటలకు హాజరుకావాలన్నారు.

దీక్ష విరమించిన సీపీఐ నేతలు


సీపీఐ నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేస్తున్న దృశ్యం

భీమవరం: అధ్వానంగా ఉన్న రోడ్లను తక్షణం నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో భీమవరంలో చేపట్టిన 32 గంటల నిరసన దీక్ష బుధవారం ముగిసింది. భీమవరం చేరుకునే ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయని తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేస్తూ ప్రకాశం చౌక్ సెంటర్‌లో దీక్షను ప్రారంభించారు. దీక్షలను సీపీఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రారంభించగా బుధవారం రాష్ట్ర నాయకుడు నెక్కంటి సుబ్బారావు, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు.

టౌన్ హాల్ అభివృద్ధికి కృషి చేయాలి

శాసన మండలి చైర్మన్ మోషేనురాజు

భీమవరం: సుదీర్ఘ చరిత్ర కలిగిన భీమవరం ఎల్‌హెచ్‌టౌన్ హాలును అభివృద్ధి చేయడానికి సభ్యులంతా బాధ్యత తీసుకోవాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. బుధవారం భీమవరం ఎల్‌హెచ్ టౌన్‌హాల్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటిష్ కాలంలో ఏర్పాటుచేసిన టౌన్‌హాల్‌కు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. టౌన్‌హాల్‌ను గౌరవప్రదంగా నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మాట్లాడుతూ వర్గ విభేదాలు విడనాడి సభ్యులంతా కలిసి టౌన్‌హాల్ అభివృద్ధికి పాటుపడాలన్నారు. వీకెండ్‌లో సభ్యులు ఫ్యామిలీతో క్లబ్‌లకు వచ్చేలా మౌలిక వసతులు, సదుపాయాలు, క్రీడా మైదానలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కోళ్ల రామచంద్రరావు(అబ్బులు), గ్రంధి సురేష్, కార్యదర్శిగా బేతు కృష్ణారావు, కోశాధికారిగా ఫిరోజ్‌బాబు, గౌరవాధ్యక్షులుగా మెంటే పార్థసారథి, గవర శేషారావును ఎన్నుకున్నట్లు ప్రకటించారు.



టౌన్‌హాల్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న మండలి చైర్మన్ మోషేనురాజు

చిరుత కోసం ముమ్మరంగా గాలింపు

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లి పరిసర ప్రాంతాల్లో చిరుత పులి సంచారం కొనసాగుతోంది. దాంతో అటవీశాఖ అధికారులు దాన్ని పట్టుకునేందుకు ముమ్మరంగా గాలిస్తున్నారు. అందులో భాగంగా ఎం.నాగులపల్లిలోని వరి పొలంలో బుధవారం మచాన్‌ను ఏర్పాటు చేశారు. కొందరు అటవీశాఖ సిబ్బంది రాత్రి ఆ మచాన్‌పై రెక్కీ నిర్వహించి చిరుత కదలికలను కనిపెట్టనున్నారు. ఇప్పటికే రెండు బోన్లు ఏర్పాటు చేసిన అధికారులు అదనంగా మరో రెండు బోన్లను అమర్చారు. ట్రాప్, లైవ్ కెమెరాల పొజిషన్లను సరిచేశారు.

పొలాల్లో సంచారం.. కుక్కలపై దాడి
రాత్రి వేళల్లో పొలాల్లో సంచరిస్తున్న చిరుత కుక్కలపై మాత్రమే దాడి చేస్తోంది. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత మనుషులపై దాడి చేసిన ఘటనలు లేవు. దాన్ని రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే ఊరుమీద పడి ప్రజలకు హాని చేసే అవకాశం ఉంది. అందుకే అటవీశాఖ అధికారులు ఎంతో జాగ్రత్తగా, చాకచక్యంగా పులిని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.


ఎం.నాగులపల్లి పొలంలో ఏర్పాటు చేసిన మచాన్


పులి బోనును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

భయాందోళనలో ప్రజలు : చిరుత పులి సంచారంతో ఎం.నాగులపల్లి, ద్వారకానగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. చెరకు, వరి పొలాల్లో, ఆయిల్ పామ్ తోటల్లో సంచరిస్తున్న పులి ఏ సమయంలో ఊరి మీదకు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎం.నాగులపల్లి శివారులోని రంగరాజు పొలంలో పులి జాడలు కలకలాన్ని రేపాయి.

పాలిటెక్నిక్ విద్యతో మెరుగైన ఉపాధి


మార్టేరు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

పెనుమంట్ర: పాలిటెక్నిక్ విద్య అభ్యసించడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవచ్చని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం నెగ్గిపూడి(మార్టేరు)లోని శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాలను సందర్శించి తనిఖీ చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల పక్కనే ప్రఖ్యాతి గాంచిన వ్యవసాయ పరిశోధనా సంస్థ ఉన్న విషయం ఎంతమందికి తెలుసని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ వ్యవసాయ కోర్సులలో ప్రవేశించి మట్టితో మమేకం కావడం ద్వారా రైతులకు సేవలు అందిస్తూ దేశంలో వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. విద్యార్థులు పదో తరగతి అనంతరం ఏఏ కోర్సులను అభ్యసించాలన్నదానిపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఆటలపై దృష్టిసారించాలన్నారు. బాల్యం నుంచి ఉన్నతంగా చదువుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్‌ను సొంతం చేసుకోవడానికి తోటి విద్యార్థులతో పోటీ పడాలన్నారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): త్వరలో ప్రారంభం కానున్న కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలోని భక్తుల సౌకర్యార్థం శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు తిప్పనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. స్థానిక డీపీటీఓ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలకు ఆదివారం రాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు బయలుదేరి సోమవారం క్షేత్రాలు దర్శించుకుని తిరిగి గమ్యం చేర్చేలా రూపొందించామన్నారు. ఈ సంవత్సరం నవంబరు 3, 10, 17, 24 తేదీలలో కార్తీక ఆదివారాల నాడు పంచారామాలకు ప్రత్యేక బస్సులు ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల నుంచి బయలుదేరుతాయన్నారు. పంచారామాలకు ప్రయాణ చార్జీలను ఎక్స్‌ప్రెస్‌కు రూ.900, అల్ట్రా డీలక్స్‌కు రూ.1100, సూపర్ లగ్జరీకి రూ.1,200గా నిర్ణయించామన్నారు. జిల్లాలోని ఆయా డిపోలకు కొత్తగా 15 సూపర్ లగ్జరీ, 4 అల్ట్రా డీలక్స్ బస్సులు వచ్చాయని, ప్రతి సంవత్సరం శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాముల కోసం వారు కోరిన క్షేత్రాలకు మంచి శిక్షణ పొందిన డ్రైవర్లతో కొత్త బస్సులను ఏర్పాటు చేశామని, సమీప డిపో మేనేజర్లని సంప్రదించి శబరిమల స్పెషల్ బస్సులు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. త్రిలింగ దర్శిని పేరిట శ్రీశైలం, మహానంది, యాగంటిలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామని, వాటన్నింటికీ ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే సదుపాయం కల్పించామన్నారు. దసరా సందర్భంగా ప్రత్యేక బస్సుల ద్వారా రూ.65 లక్షల అదనపు ఆదాయం సమకూరిందన్నారు. ఏలూరు డిపో మేనేజర్ బీ.వాణి, ఎకౌంట్స్ ఆఫీసర్ వీ. నరసింహమూర్తి, పర్సనల్ ఆఫీసర్ పీ. వేణుగోపాలరావు, పీఆర్‌ఓ కేఎల్‌వీ నరసింహం పాల్గొన్నారు.

చిరుద్యోగిపై చర్యలతో సరి !

- పెద్ద తిమింగలాల్ని వదిలేసిన వైనం
- శవాల వ్యాపారంలో కీలక పాత్రధారులెవరు ?


ఏలూరు సర్వజన ఆసుపత్రి (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీలోని అనాథ శవాల వ్యాపారంపై ఉన్నతాధికారులు ఎవరూ నోరు మెదపడం లేదు. అక్రమ వ్యాపార దందాపైనా సరైన రీతిలో దర్యాప్తు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చిరుఉద్యోగిపై వేటు వేసిన అధికారులు అసలు కీలక పాత్రధారులు ఎవరనే అంశంపై తాత్సారం చేస్తున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు కాగా.. ఏలూరు జీజీహెచ్ ప్రతిష్టను దిగజార్చిన అనాథ శవాల విక్రయాల వ్యవహారంపై ఏలూరు జిల్లా ఉన్నతాధికారులు కానీ.. ప్రజాప్రతినిధులు కానీ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలువురు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

మార్చురీ నిర్వహణ బాధ్యతలు ఎవరివి?
ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలోని మార్చురీ బోధనాసుపత్రి ఆర్ఎంవో అధీనంలో ఉండాలని చెబుతున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధంగా మార్చురీ నిర్వహణ ఉంటుందని.. ఏదైనా మృతదేహానికి పోస్టుమార్టం చేయాల్సి ఉంటే వాటికి ఆర్ఎంవో అనుమతితో మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ నిపుణుల పర్యవేక్షణలో వైద్యులు పోస్టుమార్టం చేస్తారని అంటున్నారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌ను అడిగితే అది జీజీహెచ్ పరిధిలో అంశమని చెబుతున్నారు. సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ మాత్రం మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ విభాగాధిపతి పర్యవేక్షణలో ఉంటుందంటున్నారు.

పోలీస్ దర్యాప్తునకు వెనుకడుగు
సర్వజన ఆసుపత్రి మార్చురీలో అనాథ శవాల విక్రయాల దందాతో మెడికల్ కాలేజీపైనా మచ్చ పడుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ అక్రమ వ్యాపారంలో పాత్రధారులు.. సూత్రధారులపై పూర్తిస్థాయి దర్యాప్తుకు పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టేందుకు వెనుకడుగు వేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సర్వజన ఆసుపత్రి అధికారులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పోలీస్ అధికారులు వాస్తవాలను వెలికితీస్తారని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శాఖాపరమైన విచారణ సాగేనా?
అనాథ శవాలను గుట్టుచప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాలకు తరలించినట్లు ప్రాథమికంగా గుర్తించిన సర్వజన ఆసుపత్రి అధికారులు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని విధుల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తారా? అనేది అనుమానమే అంటున్నారు. ఈ అక్రమ దందాలో మరో ఆరుగురు పాత్ర ఉందని చెబుతుండగా అధికారులకు తెలిసినా నిర్లిప్తంగా ఉండిపోవటం వెనుక కారణాలు ఏమిటనేవి తెలియాల్సి ఉంది. కీలక అధికారి సెలవులో ఉన్నారంటూ నివేదికకు మరికొంత సమయం పడుతుందని చెప్పటం వెనుక ఆంతర్యం ఏమిటో అని హాస్పిటల్ సిబ్బంది, ప్రజలు చర్చించుకుంటున్నారు.

పెద్ద తిమింగలాలపై చర్యలేవీ ?
ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలోని మార్చురీలో అనాథ శవాలను నిబంధనలకు విరుద్ధంగా భారీ రేటుకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒక్కో శవాన్ని లక్షలకు విక్రయించారని చెబుతున్నారు. స్వయంగా మార్చురీలోని అవుట్ సోర్సింగ్ సిబ్బందే మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది అశోక్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఇక్కడ వరకూ బాగానే ఉన్నా... అసలు ఈ అనాథ శవాల వ్యాపారంలో కీలక పాత్రధారులు ఎవరనేది తేలాల్సి ఉంది. ఎవరి ప్రోద్బలంతో అనాథ శవాలను రాష్ట్రాలు దాటించారనే విషయం నిగ్గుతేల్చాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోవటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

అత్తిలి: మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు బుధవారం తెలిపారు. పాలి గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలిక ఉదయం పాఠశాలకు అని చెప్పి వెళ్లింది. అయితే పాఠశాలకు వెళ్లకపోవడంతో బాలిక ఆచూకీ కోసం చుట్టుపక్కల వెదికినా ఫలితం లభించలేదు. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై ప్రేమరాజు చెప్పారు.

రెండో తరగతి విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

టి.నరసాపురం: రెండో తరగతి విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వెలగపాడు ప్రభుత్వ పాఠశాలలో సిరిబత్తుల భువనేశ్వరకుమార్ 2వ తరగతి చదువుతున్నాడు. భువనేశ్వరకుమార్, సహ విద్యార్థి కర్రలతో కొట్టుకుంటున్నారు. ఇది చూసిన ఉపాధ్యాయుడు టంగుటూరి రామాంజిబాబు ఇరువురిని దండించారు. ఈ క్రమంలో భువనేశ్వరకుమార్ దెబ్బలు ఎక్కువ తగలగా, బాలుని శరీరంపై ఉన్న గాయాలతో పాటు బాలుని ఫొటో సోషల్‌మీడియాలో హల్‌చల్ చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈవో టి.రామ్మూర్తి బుధవారం విచారణ నిర్వహించారు. ఉపాధ్యాయుడు రామాంజిబాబు బాలుని తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పి, ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా చూసుకుంటానని తెలిపినట్లు ఎంఈవో చెప్పారు. అయితే ఘటనకు సంబంధించి విద్యార్థి తల్లిదండ్రులు గాని, గ్రామస్తులు గాని ఎటువంటి ఫిర్యాదు చేయలేదని, ముందుగానే గ్రామ పెద్దలు రాజీ కుదిర్చారని అందుకే ఎవరూ ఫిర్యాదు చేయలేదని స్థానికులు అంటున్నారు.

సైబర్ వలలో వైద్యుడు

రూ.72 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన ఒక వైద్యుడికి సైబర్ నేరగాళ్లు వల వేసి రూ.72 లక్షలు కాజేశారు. టూటౌన్‌లోని ప్రముఖ వైద్యుడి పేరున ముంబైకి కొరియర్ వచ్చిందంటూ దానిలో పాస్‌పోర్టులు, ఏటీఎం కార్డులతో పాటు డ్రగ్స్ ఉన్నాయని వైద్యుడుకి ఫోన్ కాల్ వచ్చింది. దీనిపై సైబర్ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారంటూ ఫోన్లు చేసి బ్యాంకు ఖాతా వివరాలను అడిగారు. అధికారులే వివరాలు సేకరిస్తున్నారని నమ్మిన వైద్యుడు బ్యాంకు ఖాతా వివరాలను చెప్పడంతో దానిని పరిశీలించిన అనంతరం బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.72 లక్షలు మీవేనా అంటూ వైద్యుడ్ని ప్రశ్నించారు. అనంతరం మరో బ్యాంకు ఖాతా నెంబరు చెప్పి ఆ మొత్తాన్ని ఆ ఖాతాలో జమ చేయాలని, బ్యాంకు ఖాతాను పరిశీలించిన అనంతరం తిరిగి మీ ఖాతాలో జమ చేస్తామంటూ వివరించారు. సైబర్ పోలీసులే ఈ వివరాలన్నీ అడుగుతున్నారని నమ్మిన వైద్యుడు రూ.72 లక్షలు వారు చెప్పిన బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. ఆ మొత్తం తిరిగి వైద్యుడి ఖాతాలో జమ కాకపోవడంతో మోసపోయానని గుర్తించి పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. దీనిపై టూటౌన్ సీఐ జి.కాళీచరణ్‌ను వివరణ కోరగా బాధితుడి నుంచి ఫిర్యాదు అందిందని పూర్తి వివరాలు సేకరిస్తున్నామని కాళీచరణ్ తెలిపారు.

చేప ధరహాసం కొందరికే

- చేప ధర పెరిగినా రైతుకు తప్పని దిగులు
- రైతులంతా చేపలు అమ్మిన తర్వాత తాపీగా పెరిగిన ధర
- పెరిగిన ధర ఉపయోగపడేది 25 శాతం రైతులకే


ఎగుమతికి సిద్ధంగా ఉన్న చేపలు


చేపలను ఐస్ ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం

గణపవరం: ఏడాది కాలంగా అనేక ఒడిదుడుకులతో సాగుతూ రైతులకు తీవ్ర నష్టాలు మిగిల్చిన ఆక్వా సాగు క్రమంగా కుదుట పడుతూ కోలుకుంటోంది. ఇటీవల చేప ధర పెరగడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ పెరిగిన ధర కొందరు రైతులకు మాత్రమే ఉపయోగపడడంతో వారు మాత్రమే నష్టాల నుంచి బయటపడే అవకాశం ఏర్పడింది. అయితే విచిత్రంగా పెరిగిన చేప ధర 75 శాతం మంది ఆక్వా రైతులకు మాత్రం ఉపయోగపడకుండా పోయింది. కారణం చేప సాగుచేసిన రైతులందరూ నాలుగు నెలల క్రితం వరకూ తక్కువ ధరకే చేపలు అమ్ముకొని నష్టాలు మూటకట్టుకున్నారు. ఈఏడాది ఆరంభం నుంచి చేపధర కిలో రూ.95 నుంచి రూ.100 మధ్యే ఊగిసలాడింది. చేపధర ఎంతకూ పెరగక పోవడంతో రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆధరకే చేపను అమ్ముకుని నష్టాలపాలయ్యారు. చేప సాగుచేసిన రైతులు ఎక్కువ మంది చేపలు అమ్ముకున్న తర్వాత గత జూన్‌నుంచి తాపీగా చేపధర పెరుగుతూ ప్రస్తుతం కిలో రూ.120కి చేరింది. దీనితో చేపలు అమ్ముకోకుండా మిగిలిన కొద్దిపాటి రైతులకు లాభం చేకూరింది. నష్టాలు తట్టుకోలేక సాగుకు స్వస్తి పలుకుదామనుకున్న రైతుల్లో చేప ధర పెరగడంతో సాగుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. దీనితో రైతులు మళ్లీ చేపసాగుకు సమాయత్తమవుతున్నారు. గతేడాది కాలంగా చేపధర దారుణంగా పడిపోవడంతో ఆక్వా రంగం పూర్తిగా కుప్పకూలిపోయింది. ఒకపక్క చేపకు ధరలేక, మరోపక్క మేతలు, మందుల ధరలు విపరీతంగా పెరిగిపోయి, నిర్వహణ వ్యయం తడిసి మోపెడై ఎకరాకు లక్షరూపాయల వరకూ నష్టం రావడంతో చేపల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. చేపధర ఏరోజుకారోజు పెరుగుతుందన్న ఆశతో పట్టుబడికి వచ్చినా చేపను అమ్ముకోకుండా, చెరువులోనే ఉంచి, రోజుల తరబడి మేపినా ఏమాత్రం ఫలితం దక్కలేదు. చేపధర కిలో రూ.95 నుంచి రూ.100 కు మించి పెరగలేదు. ధర

జిల్లాలో చేపల సాగు వివరాలు

జిల్లాలో ఆక్వా సాగు విస్తీర్ణం :	2.80 లక్షల ఎకరాలు
చేపలసాగు విస్తీర్ణం:	1.60 లక్షల ఎకరాలు
రూప్‌చంద్ సాగు :	60 వేల ఎకరాలు
తెల్లచేప సాగు:	90 వేల ఎకరాలు

పెరుగుతుందన్న ఆశతో పట్టుబడికి వచ్చిన చేపలను చెరువులోనే ఉంచి అదనంగా మరికొన్ని రోజులు మేపడం ద్వారా రైతులు మరింత నష్టాన్ని మూటగట్టుకోవలసి వచ్చింది. పరిస్థితి మెరుగుపడుతుందన్న ఆశతో ఇన్నేళ్లుగా ఎదురు చూస్తున్న రైతులకు ఎట్టకేలకు జూన్‌నుంచి చేపధర పెరగడంతో మళ్లీ చేపలసాగుపై ఆశలు చిగురిస్తున్నాయి.

ఎకరాకు రూ.లక్షపైగా నష్టం

గతంలో ఎకరాకు లక్ష రూపాయల వరకూ మిగిలే చేపలసాగు ఏడాది కాలం నుంచి నష్టం మిగుల్చుతుంది. గత ఏడాది తెల్లచేప కిలో రూ.రూ.115 నుంచి రూ.120, రూప్‌చంద్ కిలో రూ.100 నుంచి,


చేప పిల్లలను విక్రయిస్తున్న దృశ్యం

రూ.105 పలికేది. తర్వాత తెల్ల చేప కిలో రూ.90 నుంచి రూ.95కు, రూప్‌చంద్ కిలోరూ.75 నుంచి రూ.85కు పడిపోయింది. జిల్లాలో సుమారు 1.50 లక్షల ఎకరాలలో చేపల సాగు జరుగుతుండగా ఏడాది కాలంలో లక్ష ఎకరాలలో తెల్ల చేప, రూప్‌చంద్ చేపలను తగ్గిన ధరకు అమ్మడం ద్వారా రైతులు దాదాపు వెయ్యికోట్లకు పైగా నష్టపోయినట్లు అంచనా. ప్రస్తుతం పెరిగిన ధర ఉపయోగపడేది కేవలం 25 శాతం మంది రైతులకు మాత్రమే.

చేపసాగుపై చిగురిస్తున్న ఆశలు

ప్రస్తుతం తెల్లచేప కిలో రూ.120, రూప్‌చంద్ రూ. 110కు పెరగడంతో చేపల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. చేపకు ధరలేక ఐదారు నెలలుగా చేపపిల్ల కొనేవారు కూడా లేక పోవడంతో చేపపిల్లల పెంపకం దారులు కూడా తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం చేపధర పెరగడంతో చేపల సాగుకూడా పుంజుకుంటుంది. దీనితో చేప పిల్లల ధరకూడా పెరిగింది. మూడు అంగుళాల రూప్‌చంద్ పిల్ల ధర ప్రస్తుతం రూ.4కు, ఐదంగుళాల తెల్లచేప పిల్లధర రూ. 6కు విక్రయిస్తున్నారు.

పెరుగుతున్న చెరువుల లీజు

కొన్నేళ్లుగా చేపల చెరువుల లీజులు ఆకాశాన్నంటాయి. ఎకరానికి లీజు రూ.లక్ష నుంచి రూ. 1.20 లక్షల వరకూ పలికింది. అయినా చెరువులు లీజుకు దొరకని పరిస్థితి. ఏడాది కాలంగా చేపకు ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోవడంతో చెరువుల లీజు ధర కూడా సగం పడిపోయింది. ఎకరం చెరువు లీజు రూ.50 వేల నుంచి రూ.70 వేలకు పడిపోవడంతో చెరువుల యజమానులు లబోదిబోమన్నారు. ఇటీవల చేపధర పెరగడంతో చెరువుల లీజుకూడా పెరిగింది

ధర పెరిగినా ఉపయోగం లేదు



ప్రస్తుతం చేపధర కిలో రూ.120 పలుకుతున్నా రైతులకు ఉపయోగంలేదు. ఎందుకంటే ఇప్పటికే ఎక్కువమంది రైతులు కిలో రూ.100 లోపే అమ్మేసుకున్నారు. చేప తగినంతగా లేకపోవడం వల్లనే వ్యాపారులు ధర పెంచారు. పెరిగిన ధర కొద్దిమంది రైతులకు మాత్రమే ఉపయోగపడుతుంది. తక్కువ ధరకు అమ్ముకోవడంవల్ల టన్నుకు రూ.20 వేల వరకూ నష్టపోయాం.

– సంకు శ్రీను, చేపలరైతు

చేపపిల్ల సాగుతో నష్టాలు



నేను పదేళ్లుగా రూప్‌చంద్ చేపపిల్లల పెంపకం చేస్తున్నాను. ఇప్పుడున్నంత గడ్డు పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. ఐదారు నెలలుగా చేపపిల్ల కొనే నాథుడే కనపడలేదు. ఏడాదిక్రితం రూ.8 పలికిన ఐదంగుళాల చేపపిల్ల రూ.3 కు పడిపోయింది. ప్రస్తుతం చేప ధర పెరగడంతో రైతులు మళ్లీ చేపల సాగుకు ఉపక్రమిస్తున్నారు. దీంతో నెల రోజులుగా చేపపిల్ల విక్రయాలు జరుగుతున్నాయి.

– యర్రా ఆదినారాయణ, చేపపిల్ల పెంపకందారు

జాతీయ పారా స్విమ్మింగ్ చాంపియన్‌గా కార్తీక్


గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ చేతులమీదుగా ట్రోఫీని అందుకుంటున్న భవానీ కార్తీక్

జంగారెడ్డిగూడెం: జాతీయ పారా స్విమ్మింగ్ చాంపియన్ షిప్ 2024ను జంగారెడ్డిగూడెం చెందిన ఆర్‌వీవీ భవానీ కార్తీక్ సాధించాడు. గోవాలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగిన టోర్నమెంట్‌లో భవానీ కార్తీక్ మూడు ఈవెంట్లలో మూడు స్వర్ణ పతకాలు సాధించి చాంపియన్‌గా నిలిచాడు. బెస్ట్ స్విమ్మర్ అవార్డుకు కూడా ఎంపికయ్యాడు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ చేతుల మీదుగా కార్తీక్ చాంపియన్ షిప్ అందుకున్నాడు. సింగపూర్‌లో 2025 సెప్టెంబర్‌లో జరగనున్న అంతర్జాతీయ పారా చాంపియన్ షిప్‌లో భారత దేశం తరపున ప్రాతినిథ్యం వహించే అవకాశం కార్తీక్‌కి దక్కింది. 2020లో బెంగుళూర్, 2021లో ఉదయపూర్, 2022లో గౌహతి, 2023లో గ్వాలియర్, ఇప్పుడు 2024లో గోవా, ఈ ఐదు జాతీయ పారా స్విమ్మింగ్ చాంపియన్ షిప్‌లలో మూడు స్వర్ణ పతకాలు చొప్పున ఇప్పటివరకు 15 స్వర్ణ పతకాలు కార్తీక్ సాధించాడు. 2023 సెప్టెంబర్‌లో ఈజిప్టులో జరిగిన అంతర్జాతీయ పారా స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి భారత దేశ కీర్తి బావుటా ఎగురవేశాడు.

మద్యం విక్రేతల పట్టివేత

ముసునూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి, మద్యం కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను ఏలూరు స్పెషల్ స్క్వాడ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య తెలిపారు. మంగళవారం సాయంత్రం ముసునూరుకు చెందిన అనగాని సీతామహాలక్ష్మి, పద్మకుమారి అక్రమంగా మద్యం నిల్వ ఉంచి, అమ్ముతున్నారనే సమాచారంతో వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 20 ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ 180 ఎంఎల్ బాటిల్స్, మరో ఏడు 180 ఎం.ఎల్ ఏసీ బ్లాక్ రిజర్వ్ విస్కీ బాటిల్స్, 13 మంజీరా బ్లూ క్లాసిక్ విస్కీ 180 ఎం.ఎల్ బాటిల్స్, మొత్తం 40 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

ధన్వంతరిస్వామి జయంతిని ఘనంగా నిర్వహించాలి


విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

భీమవరం: ఆయుర్వేద వైద్య మూల పురుషుడు ధన్వంతరిస్వామి జయంతిని ఈనెల 29వ తేదీన జిల్లాలోని నాయీ బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సత్యనారాయణ, సీహెచ్ బంగారరావు, కోశాధికారి పీవీవి సత్యనారాయణ చెప్పారు. బుధవారం భీమవరంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ కనీస వైద్య సదుపాయాలు లేని రోజుల్లో ధన్వంతరిస్వామి ఆయుర్వేద వైద్యానికి ప్రత్యేక స్థానాన్ని కల్పించారన్నారు. ఆ మహనీయుని జయంతిని నాయీ బ్రాహ్మణ కులానికి చెందిన ప్రతి ఒక్కరూ ఘనంగా జరపాలన్నారు. ధన్వంతరి జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం పాలకొల్లు మండలం పూలపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి. వెంకటాపురం గ్రామానికి చెందిన కుంచే నాగరాజు (34) ఐదేళ్ల నుంచి పూలపల్లిలో ఇద్దరు పిల్లలు ఉన్న ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. రెండు నెలల క్రితం ఆమె గల్ఫ్ దేశానికి వెళ్లింది. అప్పటినుంచి ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం పిల్లలు బంధువుల ఇంటికి వెళ్లారు. నాగరాజును అతని కుటుంబ సభ్యులు పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని సోదరుడు కుంచే వరప్రసాద్ ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై బాదం శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచారామక్షేత్రంలో ఆర్‌జేసీ విచారణ

భీమవరం(ప్రకాశం చౌక్): దేవదాయ శాఖ ఆర్‌జేసీ (రాజమండ్రి) కె.సుబ్బారావు బుధవారం పంచారామక్షేత్రంలో విచారణ చేపట్టారు. క్షేత్రంలో సాధారణ సేవకుడిగా పనిచేస్తున్న అమర్ అనే వ్యక్తికి నిబంధనలు అతిక్రమించి గుమస్తా కమ్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇచ్చారని పంచారామక్షేత్రం మాజీ చైర్మన్ భర్త కోడే యుగంధర్ దేవదాయ శాఖ మంత్రి, ప్రిన్సిపాల్ సెక్రటరీకి, కమిషనర్‌కు, అలాగే లోకాయుక్తకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్‌జేసీ పంచారామక్షేత్రంలో విచారణ నిర్వహించారు. ఈవో, కోడే యుగంధర్, ఆర్ఎస్ఎస్‌కు చెందిన మహేష్ ఆర్‌జేసీకి పలు వివరాలు సమర్పించారు. విచారణ నివేదికను కమిషనర్‌కు అందజేస్తానని ఆర్‌జేసీ సుబ్బారావు తెలిపారు.


భీమవరం పంచారామక్షేత్రం ఈవో కార్యాలయంలో విచారణ చేస్తున్న దేవదాయ శాఖ ఆర్‌జేసీ సుబ్బారావు

దేవస్థానం నిధుల దుర్వినియోగంపై విచారణ

అత్తిలి: జిల్లాలో వైష్ణవ క్షేత్రాలలో ప్రసిద్ధిగాంచిన బల్లిపాడు శ్రీమదనగోపాలస్వామివారి దేవస్థానం నిధులను ఈవో హరిగోపినాథ్ దుర్వినియోగం చేశారని వచ్చిన ఫిర్యాదుల మేరకు బుధవారం దేవాదాయశాఖ ఆర్‌జేసీ సుబ్బారావు విచారణ చేపట్టారు. ఆలయంలో బాధితుల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదులను స్వీకరించారు. నిబంధనలకు విరుద్ధంగా దేవస్థానం ఖాతానుంచి ఈవో నగదు విత్‌డ్రా చేసి దుర్వినియోగం చేశారని ఈనెల 4న గ్రామస్తులు ఆందోళన చేసి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్‌జేసీ సుబ్బారావు విచారణ నిర్వహించారు. ముందుగా ఆలయ మర్యాదల ప్రకారం ఆర్‌జేసీ సుబ్బారావుకి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

అనుమానాస్పద స్థితిలో చిత్తూరు జిల్లా వాసి మృతి

జి.డి. నెల్లూరులో కిడ్నాప్ కేసు నమోదు

ముసునూరు: చిత్తూరు జిల్లా వాసి ముసునూరు మండలంలోని కాట్రేనిపాడు శివార్లలో అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. జి.డి నెల్లూరు సీఐ ఎం.లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలివి. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలానికి చెందిన కంటే జగన్నాథం ప్రొక్లెయిన్‌లు, జేసీబీలు కంటిన్యూషన్ ఫైనాన్స్‌పై కొనుగోలు చేసి అమ్ముతూ ఉంటాడు. వాటిని ఇతరులకు అమ్మిన తర్వాత అసలు వాహన యజమానులకు అందుబాటులో లేకుండా పోవడం ఇతని నైజం. ఈ నేపథ్యంలోనే ఏలూరు జిల్లా ముసునూరు మండలంలోని కాట్రేనిపాడులో ఒక జేసీబీని కంటిన్యూషన్ ఫైనాన్స్ పద్ధతిపై కొనుగోలు చేసి, కనిపించకుండా పోయాడు. దీంతో జేసీబీ యజమాని తోపాటు, మృతుని చేతిలో మోసపోయిన వివిధ జిల్లాలకు చెందిన మరికొందరు మొత్తం 12 మంది వాహనదారులు కలసి చిత్తూరు జిల్లాకు వెళ్లి, అతన్ని పట్టుకుని ముసునూరు తీసుకువస్తున్న క్రమంలో కాట్రేనిపాడు శివార్లలోని ఓ పామాయిల్ తోటలో మంగళవారం శవమై కనిపించాడు. అప్పటికే వాహనదారులపై జీ.డి.నెల్లూరులో కిడ్నాప్ కేసు నమోదైనట్లు సమాచారం అందుకున్న నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ, ముసునూరు ఎస్సై చిరంజీవి చురుగ్గా స్పందించి నిందితులను అదుపులోకి తీసుకోవడంలో చిత్తూరు పోలీసులకు సహకరించారు. దీంతో మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


కాట్రేనిపాడు శివారు పామాయిల్ తోటలో జగన్నాథం మృతదేహం

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

భీమవరం: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పురుషుల టోర్నమెంట్‌కు భీమవరం విష్ణు డెంటల్ కళాశాల విద్యార్థి వి సోహన్ దత్తా ఎంపికయ్యాడు. ఈనెల 22వ తేదీన రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో నిర్వహించిన ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ బ్యాడ్మింటన్ పురుషుల టీమ్‌కు ఎంపిక జరిగింది. ఈ పోటీల్లో ఎంపికైన సోహన్‌దత్తా ఈనెల 26వ తేదీ నుంచి చైన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటాడని కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రామరాజు, ఫిజికల్ డైరెక్టర్ జీబీఎస్ కుమార్‌రాజు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థిని వారు అభినందించారు.


భీమవరం విష్ణు కళాశాల వద్ద సోహన్‌దత్తాను అభినందిస్తున్న దృశ్యం

ఎస్‌జీఎఫ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు బుధవారం జరిగాయి. స్థానిక ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఏలూరు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అలివేలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు పలు ప్రభుత్వ పాఠశాలల బాలబాలికలు తరలివచ్చారు. త్రోబాల్, కబడ్డీ అండర్-14, 17 కేటగిరీలో బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన బాలబాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని కార్యదర్శి వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్‌లో వివిధ జిల్లాల్లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు భోగలింగేశ్వరరావు, ఎంఎన్ శ్రీనివాసకుమార్ పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

రామశింగవరం జెడ్పీ పాఠశాల విద్యార్థులు కేతవరపు రాజశ్రీ, చలమల దివ్యశ్రీ, పారేపల్లి హర్షల శ్రీపావని అండర్-14, 17 జిల్లా త్రోబాల్ జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల పీడీ జమ్మ రామకృష్ణ చెప్పారు. వీరితో పాటు బాలుర విభాగంలో తాడిగడప దిలీప్, పి వంశీ అండర్- 17 త్రోబాల్ జట్టుకు ఎంపికయ్యారని వివరించారు.


ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు

అక్క కాపురాన్ని సరిచేద్దామని వచ్చి..


ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న స్వరూప

ఏలూరు టౌన్: అక్క కాపురాన్ని సర్దిచేద్దామని వచ్చిన ఓ బాధితురాలు బావ, అతని బంధువుల వేధింపులు, దూషణలు భరించలేక తీవ్ర మనోవేదనకు గురై చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి సోదరి, పోలీసులు తెలిపిన వివరాలివి. ఏలూరు శివారు వట్లూరు సమీపంలోని శౌరీపురానికి చెందిన చొదిమెళ్ళ శైలజ (22)కు పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన రమేష్‌తో 2017లో వివాహమైంది. నెల రోజుల కిత్రం శైలజ తన భర్తతో గొడవపడి పిల్లలను తీసుకుని శౌరీపురంలోని పుట్టింటికి వచ్చేసింది. తన అక్క కాపురాన్ని సరిచేసేందుకు ఏలూరు కోటదిబ్బలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం శైలజ, ఆమె చెల్లి స్వరూప రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు శైలజ భర్త రమేష్‌కు ఫోన్ చేసి వెంటనే రావాలని చెప్పటంతో అతను తన కుటుంబ సభ్యులతో కలిసి స్టేషన్‌కు వచ్చాడు. తాము పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించుకుంటామని చెప్పారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చిన రమేష్, అతని కుటుంబ సభ్యులు పోలీస్ కేసు పెట్టటానికి కారణం స్వరూపే అంటూ దుర్భాషలాడి ఆమెపై దాడికి యత్నించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై స్వరూప స్టేషన్ సమీపంలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన బాత్‌రూమ్‌లోకి వెళ్లి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన పోలీసులు ఆమెను పోలీస్ వాహనంలోనే ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు విజయవాడ రిఫర్ చేశారు. ఈ ఘటనపై వైద్యులు ఎంఎల్‌సీ నమోదు చేసి హాస్పిటల్ అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు.

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

ఏలూరు టౌన్: గల్ఫ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి, విజిటింగ్ వీసాతో విదేశాలకు పంపుతూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో బుధవారం డీఎస్పీ శ్రావణ్‌కుమార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఏలూరు వన్‌టౌన్ బావిశెట్టివారిపేటకు చెందిన బైలపాటి దుర్గాప్రసాద్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఇతడికి పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ళమండలం బొండాడ గ్రామానికి చెందిన దుండి జాన్‌బాబు విదేశాలకు వ్యక్తులను పంపే ఏజెంట్‌గా పరిచయమయ్యాడు. దీంతో భారీగా డబ్బులు చెల్లించి ఏజెంట్ జాన్‌బాబు ద్వారా 2023 ఫిబ్రవరిలో దుర్గాప్రసాద్ తన భార్య నాగమ్మను ఓమన్ దేశానికి పంపాడు. అయితే విజిటింగ్ వీసాపై వెళ్లిన ఆమెను గడువు ముగిసిన అనంతరం అక్కడి పోలీసులు వీసా నిబంధనల మేరకు అరెస్ట్ చేశారు. దీంతో దుర్గాప్రసాద్ ఏజెంట్ జాన్‌బాబుపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి నుంచీ గాలిస్తుండగా బుధవారం ఏలూరు నగరంలోని పాండురంగ థియేటర్ సమీపంలో నిందితుడు జాన్‌బాబును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఓమన్ దేశంలో పాలడుగు ప్రసాద్ అనే వ్యక్తి సహాయంతో ఏజెంట్ అవతారం ఎత్తిన జాన్‌బాబు గ్రామీణ ప్రాంతాల్లోని అమాయకులైన ప్రజలను మోసం చేస్తున్నాడని చెప్పారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ, ఎస్సై మదీనా బాషా, హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ, కానిస్టేబుల్ సురేష్‌కుమార్, యశ్వంత్‌కుమార్ ఉన్నారు.

క్లుప్తంగా

సమష్టి కృషితో దోమల నివారణ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆరోగ్య అధికారి లక్ష్మణరావు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రామస్తుల సమష్టి కృషితో దోమలను అరికట్టవచ్చని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలో బుధవారం పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని 34, 35 వార్డులలో ఆరోగ్య సిబ్బందితో పర్యటించి, వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శి రాజేశ్వరి, జ్యోతి, ఆశా వర్కర్ సుజాత, స్వాతి, దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన వెంకటేష్



తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఊబా వెంకటేష్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. ఏలూరులో బుధవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి వెంకటేష్‌ను గ్రామ సర్పంచ్ పిల్లా రాంబాబు, హెచ్‌ఎం చంద్రశేఖర్, పీడీ బడుగు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

మాలల సింహగర్జన విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గుంటూరు జిల్లాలో నాగార్జున యూనివర్శిటీకి ఎదురుగా ఉన్న స్థలంలో నవంబరు 26వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల సింహగర్జన సభ జరుగుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు తెలిపారు. పట్టణంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలను చైతన్యం చేసేందుకు జేఏసీ ఏర్పడిందని వెల్లడించారు. సింహగర్జన సభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది మాలలు తరలిరావాలని, అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర జేఏసీ కన్వీనర్ బేతాళ శరత్‌బాబు, సెక్రటరీ చొడదాసి జైపాల్, వి.సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ



ఫిజియోథెరపీ కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్‌చే బుధవారం దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం జరిగింది. దివ్యాంగుల పిల్లలకు ప్రతి రోజు క్రమం తప్పకుండా థెరపీ చేయడం ద్వారా పిల్లల్లో కండర సమస్యలు తగ్గించవచ్చునని చెప్పారు. దీని వల్ల పిల్లల్లో సామర్థ్యాలు పెరిగి ఇతరుల మీద ఆధారపడకుండా తమ పనులు చేసుకోగల్గుతారని చెప్పారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాలీశ్వరయ్య ప్రతి బుధవారం ఉచితంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ సేవలు అందిస్తారని చెప్పారు. ప్రత్యేక ఉపాధ్యాయని ఎం.చంద్రకుమారి, నాగలక్ష్మి, దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య ఇబ్బందులు లేకుండా చర్యలు

నరసాపురం: పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. పట్టణంలో వివిధ వార్డుల్లో చేస్తున్న పారిశుద్ధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పట్టణంలో సంపూర్ణ పారిశుద్ధ్య పనులు పేరుతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పారు. వర్షాలు అధికంగా పడుతున్న నేపథ్యం విషజ్వరాలు ప్రబలకుండా, ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోజూ డ్రైయిన్లు శుభ్రం చేయాలని, మురుగునిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కిషోర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

శునకాల స్వైర విహారంతో బెంబేలు

- పట్టణంలో ఎక్కడ చూసినా కుక్కలే
- పలువురికి కుక్క కాట్లు



పట్టణంలో యథేచ్ఛగా సంచరిస్తున్న కుక్కలు



కుక్కలకు వ్యాక్సినేషన్ వేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ, గ్రామ ప్రజలు శునకాల బెడదతో బెంబేలెత్తుతున్నారు. ప్రతి వీధిలో గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నాయి. పట్టణంలో ఎక్కడ చూసిన కుక్కలు హడావిడి ఎక్కువగా ఉంటుంది. మొత్తం మునిసిపాలిటీ వారిచే 1126 కుక్కలను గుర్తించారు. ప్రతి రోజు రాత్రి, పగలు తేడా లేకుండా వాటి అరుపులతో దద్దరిల్లిపోతుంది. కొన్ని ప్రాంతాలలో స్వైర విహారం చేస్తూ పిల్లలు, పెద్దలు, వృద్ధులు, మహిళలపై దాడులు చేస్తున్నాయి. అవి కరవడంతో వారు ఆసుపత్రి పాలవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు వెంట పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మార్గంలో అవి ఒక వైపు నుంచి మరో వైపునకు వెళ్లే క్రమంలో వేగంగా వచ్చే వాహనాలకు అడ్డు పడుతున్నాయి. వాహనదారులు రోడ్డుపై పడిపోతున్నారు. దీంతో వారు ఆస్పత్రి పాలవుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించేందుకు, ఫ్యామిలీ ప్లానింగ్ చేసేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జంతు ప్రేమికులతో ఇక్కట్లు:
వీధి కుక్కలను నియంత్రించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా జంతు ప్రేమికుల దెబ్బకు అధికార యంత్రాంగం హడలిపోతుంది. కుక్కలు జోలికి వస్తే కేసులు పెడతామని హెచ్చరించడంతో సంబంధిత అధికారులు నియంత్రించేందుకు చర్యలు చేపట్టడం లేదు. పట్టణంలో ఓ అధికారిని జంతు ప్రేమికులు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పిన ఘటన ఉంది.

కుక్కలకు శస్త్ర చికిత్సలు
వీధికుక్కలను నియంత్రించేందుకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించాలన్న ప్రతిపాదనలు ఉన్నప్పటికి ఎన్నో సంవత్సరాలుగా అమ లు చేయలేకపోతున్నారు. మునిసిపల్ అధికారులు ఇటీవల బ్లూ క్రాస్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఇటీవల కొన్ని కుక్కలకు వ్యాక్సినేషన్ చేశారు. వాక్సినేషన్ కొనసాగుతుందని చెబుతున్నారు. శస్త్ర చికిత్సలు కోసం పశుసంవర్ధక శాఖ అధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు.

కుక్క కాటుకు తప్పక వ్యాక్సినేషన్ తీసుకోవాలి
ఏరియా ఆసుపత్రికి నెలకు సుమారు 150 మంది వరకు కుక్క కాటు నిమిత్తం వాక్సినేషన్‌కు వస్తున్నారు. కుక్క కాటుకు గురైన వారు తప్పక వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుంది. ముందుగా కక్క కరిసిన గాయాన్ని సబ్బుతో కడిగి సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. వైద్యుని సంప్రదించి క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయించుకోవాలి.

కుక్కలకు వ్యాక్సినేషన్ చేస్తున్నాం



పట్టణంలో 1126 కుక్కలను గుర్తించాం. కుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపడతున్నాం. ఇటీవల వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టాం. ఇప్పటి వరకు 117 కుక్కలకు వ్యాక్సినేషన్ చేశాం. నిబంధనలు మేరకు వీటికి శస్త్ర చికిత్సలు చేయించాల్సి ఉంది. పశుసంవర్ధక శాఖ ద్వారా ఫ్యామిలీ ప్లానింగ్ చేసేందుకు సంప్రదించాం. కుక్కల ఆపరేషన్లు నిమిత్తం కెనాల్స్ ఏర్పాటు, ఆపరేషన్ థియేటర్లు నిర్వహించేందుకు టెండర్లు పిలవడం జరిగింది. గవర్నమెంట్ రూల్ ప్రకారం ఆపరేషన్ నిమిత్తం ఒక కుక్కకు రూ. 1500 చెల్లించాల్సి ఉంది.

– మునిసిపల్ మేనేజర్, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్, రవి సుధాకర్

అప్రమత్తంగా ఉండాలి



కుక్కలు పట్టణంలో ఎక్కువగా ఉంటున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్నాయి. కుక్కలు కరిసిన సంఘటనలు ప్రతి రోజు నమోదు అవుతున్నాయి. రహదారి మార్గాలలో కుక్కలు అడ్డం వచ్చి పడిపోతున్నారు. కుక్కలకు వ్యాక్సినేషన్‌తో పాటు, ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేయించాలి. రోడ్డు మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనదారులు కుక్కల పట్ల అప్రమతంగా ఉండాలి.

– యెగ్గిన శరత్ బాబు, తాడేపల్లిగూడెం

25 నుంచి పెనుగొండ-పెరవలి రోడ్డు మూసివేత

ఇరగవరం: ఈ నెల 25 నుంచి వచ్చే నెల 12 వ తేది వరకు 20 రోజుల పాటు పెనుగొండ, పెరవలి రహదారిని మూసివేస్తున్నట్లు ఆర్ అండ్ బీ ఏఈ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఇరగవరం మండలం ఏలేటిపాడు, అయితంపూడి వద్ద సీసీ రోడ్డు నిర్మాణంలో భాగంగా మూసి వేయడం జరుగుతుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పెరవలి, ఇరగవరం, పెనుగొండ, రూరల్ పోలీసులకు రహదారి మూసివేత వివరాలు వెల్లడించామని ఆయన వివరించారు. రహదారి నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది వినతి

పాలకొల్లు అర్బన్: ఎన్టీఆర్ వైద్య సేవలో 17 ఏళ్ల నుంచి సేవలందిస్తున్న సిబ్బంది సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా సమన్వయాధికారిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని ఇన్సూరెన్స్ స్కీంలో విలీనం చేయాలని ప్రభుత్వం యోచనలో ఉందని, అయితే ఈ పథకంలో పనిచేస్తున్న వైద్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్‌లు, జిల్లా మానిటరింగ్ యూనిట్ లో వివిధ కేడర్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల భవితవ్యం అయోమయంగా ఉందన్నారు. ప్రభుత్వం వీరికి స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేనిపక్షంలో ఈనెల 29 సమ్మె చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 25న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తామని, 26న నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ యూనియన్ కోశాధికారి రామమోహన్, టీం లీడర్ రాంబాబు, ఊగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు భారంగా హెచ్‌ఎంల కొరత



వేల్పూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం

తణుకు టౌన్: ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు సతమతమవుతున్నారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పాఠశాలలో చదివే విద్యార్థులను, పాఠశాలలో పాఠాలు బోధించే ఉపాధ్యాయులను క్రమశిక్షణలో నడిపించే ప్రధానోపాధ్యాయుల పోస్టులు నెలల తరబడి ఇన్‌చార్జిలతో నిర్వహించడంతో ఉపాధ్యాయులపై పని బారం పెరిగి విద్యార్థులకు పాఠాల భోదనలో తీవ్ర ఒత్తిడి పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో భోదనతో పాటు అనేక భోదనేతర పనులను ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయులు చొప్పున ఉంటారు. వీరందరని ప్రధానోపాధ్యాయులు సమన్వయం చేసుకుంటూ విద్యార్థులకు భోదించే పాఠ్యాంశాలను ఒక ప్రణాళిక ప్రకారం ఉదయం నుంచి సాయంత్రం పాఠశాలలో భోదించేలా క్లాసులను విభజిస్తారు. ఆ విభజన ప్రకారం సబ్జెక్ట్ ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను భోదిస్తారు. ప్రతీ ఉన్నత పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయులు అవసరం ఉన్నప్పటికీ గత ఆరు నెలల కాలంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేసిన వారి స్థానంలో కొత్తగా ప్రధానోపాధ్యాయులను నియమించకపోవడంతో పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులను పూర్తి అధనపు బాధ్యతలతో హెచ్‌ఎంగా బాధ్యతలు అప్పగించారు. తణుకు ఉప విద్యాశాఖాదికారి పరిదిలోని 10 మండలాలలో మొత్తం 81 జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 81 మంది ప్రదానోపాధ్యాయులు అవసరం ఉండగా వాటిలో 14 మంది పాఠశాలలకు చెందిన ప్రదానోపాధ్యాయుల పదవీ విరమణ చేయడంతో రెండు నెలల నుంచి 1 సంవత్సరం కాలంగా ఇన్‌చార్జి హెచ్‌ఎంలతోనే నడుస్తున్నాయి. దీనితో హెచ్‌ఎంలగా నియమితులైన ఉపాధ్యాయులు ప్రదానోపాధ్యాయులుగా పాఠశాల పరిపాలన విధులతో పాటు తమ సబ్జెక్ట్‌లను కూడా విద్యార్థులకు పాఠాలను భోదించాల్సి ఉంటుంది. పాఠశాల నిర్వహణలో ఉన్న ఒత్తిడితో పాటు పాఠాల భోదన కూడా చేయడం వలన విద్యార్థులకు ఆయా సబ్జెక్ట్‌లను బోధించే ఉపాధ్యాయులు హెచ్‌ఎంలుగా బాధ్యతలు చేపట్టడంతో ఆయా సబ్జెక్ట్‌లను భోదనలో వెనుకబడిపోతున్నట్లు తెలిపారు. ఈ అదనపు బాధ్యతలు నిర్వహించే ఉపాధ్యాయులు ఇంగ్లీష్, గణితం, సైన్స్ బోధించే ఉపాధ్యాయులైతే ఆ విద్యార్థులకు మరింత ఇబ్బందులు లేర్పడతాయని పేర్కొంటున్నారు. తణుకు డివిజన్ పరిదిలోని తేతలి, మండపాక, వేల్పూరు, ముద్దాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు తూర్పు గోదావరి జిల్లాలోని ఉండ్రాజవరం, వేలివెన్ను, వడ్లూరు, పెరవలి మండల కానూరు, అత్తిలి మండలం బల్లిపాడు, పెనుమంట్ర మండలం మార్టేరు బాలికల ఉన్నత పాఠశాల, కొమ్ముచిక్కాల, కవిటం గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలో ప్రదానోపాధ్యాయులు పదవీ విరమణ చేసి నెలలు గడుస్తున్నా వారి స్థానంలో కొత్త వారిని హెచ్‌ఎంలగా నియమించలేదు. వీటితో మండల పరిషత్ ఆధీనంలో నిర్వహించే ప్రాథమిక పాఠశాలల్లో కూడా హెచ్‌ఎం పోస్టులు గత ఆరు నెలలుగా నియామకాలు లేక ఇన్‌చార్జులతోనే నిర్వహిస్తున్నట్లు పేర్కొంటున్నారు. వీటిలో తణుకు జోన్ పరిదిలో సుమారు 20 నుంచి 30 వరకూ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు ఖాలీగా ఉంటాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

నెలవారీ పదోన్నతులు లేక...
విద్యా శాఖలో ఉపాధ్యాయులకు నెల నెలా పదోన్నతుల జాబితాను ప్రకటించే వారు. దీనితో హెచ్‌ఎంలు, నుంచి స్కూల్ అసిస్టెంట్ పోస్టుల వరకూ ఎక్కడా ఖాలీలు ఉండేవి కాదని, అయితే గత ఆరు నెలలుగా ఆ జాబితాలను ప్రకటించకపోవడంతోనే హెచ్‌ఎం నియామకాలు ఆగిపోయాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. వీటితో డివిజన్‌లో పరిదిలోని అత్తిలి మండలంలో హిందీ సబ్జెక్టుకు సంబందించిన పాలి, కంచుమర్రు, అత్తిలి, కొమ్మర పాఠశాలలో హిందీ సబ్జెక్ట్ ఉపాధ్యాయుల ఖాలీలు ఉన్నట్లు తెలిసింది.

పదోన్నతులు కల్పిస్తే...

జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తే ప్రదానోపాధ్యాయులతో పాఠశాలల్లో సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కొరత సమస్య తీరుతుంది. జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల్లో అనేక మంది ఉపాధ్యాయులు పదోన్నతలకు అర్హత కలిగి వున్నారు. పదోన్నతుల ద్వారా హెచ్‌ఎంలను నియమిస్తే హె చ్‌ఎం కొరత సమస్యల పరిష్కారమవుతుంది.

– కర్రి పుల్లారెడ్డి, హెచ్‌ఎం ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తేతలి

మండలానికి 2 నుంచి 3 ఖాళీలు

తణుకు డివిజన్‌లోని 10 మండలాలకు సంబంధించిన ఉన్నత, ప్రభుత్వ పాఠశాలలో 14 హెచ్‌ఎంలు ఖాలీలు వున్నాయి. అదే ప్రాథమిక పాఠశాలల్లో మండలానికి 2 నుంచి 3 వరకూ హెచ్‌ఎం పోస్టుల ఖాలీలు ఉన్నాయి.

– డీ మురళీ సత్యనారాయణ, డీవైఈవో, తణుకు

కారుమూరి పరామర్శలు



తణుకులో పార్టీ నాయకురాలు ఫహీమాను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి



రేలంగిలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరమర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. పార్టీ నాయకులు నర్రెడ్డి గుణ్ణ, నర్రెడ్డి సత్తిబాబుల తల్లి రంగనాయకమ్మ అనారోగ్యం బారిన పడి మృతి చెందడంతో కారుమూరి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే పార్టీ మైనారిటీ సెల్ తణుకు నియోజకవర్గ అధ్యక్షురాలు షేక్ ఫహీమా తండ్రి మరణించగా ఆమెను, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పైడిపర్రుకు చెందిన దంపతులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, దుర్గ కుటుంబసభ్యులను, తండ్రిని కోల్పోయిన పార్టీ నాయకులు కోన రమేష్‌ను, పార్టీ బీసీ నాయకులు నార్గాని సత్యనారాయణ మృతికి ఆయన కుటుంబసభ్యులను, సందాపు సత్యనారాయణ మృతికి కుమారుడు సందాపు దుర్గారావును, పెనుగొండలో కూనపరెడ్డి నానాజీ మృతికి వారి కుటుంసభ్యులను కారుమూరి పరామర్శించి, కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, నాయకులు మారిశెట్టి శేషగిరి, షేక్ జిలాని, గారపాటి సత్యనారాయణ, వై.రామకృష్ణ, కంచుమర్తి విశ్వేశ్వరరావు ఉన్నారు.

అత్తిలి: మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం అత్తిలి గ్రామంలో పర్యటించి పలు శుభకార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ముందుగా ఆయన స్వగృహానికి చేరుకుని పార్టీనాయకులు, కార్యకర్తలను కలుసుకుని యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఇటీవల అత్తిలిలో మృతిచెందిన పలువురిని కారుమూరి వెంకట నాగేశ్వరరావు పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కోరుకొల్లు వెంకట్రావు, యడ్లపల్లి మణికుమార్, బుడితి సుజన్‌కుమార్, బుంగా పద్మారావు, రామిశెట్టి రాము, కాకర్లపండు, యడ్లపల్లి గురు తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం: కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని మాజీ మంత్రి మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు కారుమూరి నాగేశ్వరరావు అన్నారు బుధవారం ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గునిశెట్టి ప్రభాకరరా వు, అడబాల సుబ్బ లక్ష్మి, సనమండ్ర నవ రత్నకుమారి, మద్దాల సూరిబాబు, కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మహిళ అధ్యక్షురాలు మెట్ల కిరణ్మయి, మాజీ సర్పంచ్ మైనం పాము, గాదిరాజు బుజ్జి, ఎంపీటీసీలు దాసి రెడ్డి సీత మహలక్ష్మి, ఉప సర్పంచ్ పులుపు అక్కమాంబ, రమణ, కృష్ణంరాజు, రాజేష్ కుమార్, మారంపూ డి దాసు, కాసాని సత్యనారాయణ, బాబాయ్ కుమార్, బొక్క బాబి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ మద్దతు ధర పొందాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు తాము పండించిన పంటను రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్. ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని దండగర్ర,మోదుగ గుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రాబోయే దాళ్వాలో రైతులు ఎంటీయు 1121 రకం వరి వంగడాన్ని సాగు చేసుకోవాలన్నారు. ఈ రకం వరి వంగడం కావలసిన రైతులు ఆర్‌ఎస్‌కేల ద్వారా రాయితీపై పొందాలని సూచించారు. మండల ఉద్యాన శాఖఅధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ పామాయిల్‌వేసుకునే రైతులకు ప్రోత్సాహాలు అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా రాంబాబు, ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ భార్గవి దేవి, వెటర్నరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సభలు సద్వినియోగం చేసుకోండి



సూరంపూడి గ్రామ సభలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

ఇరగవరం: రీసర్వే చేసిన గ్రామాల్లో భూయజమానులు తమ సమస్యలు నివృత్తి చేసుకొనేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుందర రాజు తెలిపారు. మండలంలోని సూరంపూడి, రాపాక గ్రామాల్లో భూముల రీసర్వేకి సంబంధించి గ్రామ సభలు నిర్వహించిన ట్లు మండల భూముల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పోతురాజు తెలిపారు. బుధవారం నిర్వహించిన గ్రామ సభల్లో 36 ఫిర్యాదులు వచ్చాయన్నారు. తహసీల్దార్ ఎం సుందర్ రాజు మాట్లాడుతూ గ్రామల్లో జరుగుతున్నా రెవెన్యూ రీ సర్వే గ్రామ సభలను ప్రతి రైతు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పోతురాజు, మండల సర్వేయర్ ప్రియాంక, సర్పంచ్ కటారి చంద్ర మణి, వైఎస్సార్ సీపీ నాయకులు కటారి రాంబాబు, జాలి సుబ్బారావు, తెదేపా మండల అధ్యక్షుడు గొపిశెట్టి రామకృష్ణ, తెదేపా, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పకు పడిపూజ



తణుకులో అయ్యప్పస్వామికి పడిపూజ నిర్వహిస్తున్న మాలదారులు

తణుకు అర్బన్: తణుకు జాతీయరహదారి సమీపంలోని శ్రీధర్మశాస్త్ర పంచాయతన అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి స్వామివారికి వైభవంగా పడిపూజ నిర్వహించారు. గురుస్వామి చలపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పడిపూజ కార్యక్రమంలో స్వామివారిని విశేషంగా అలకంరించారు. స్వామివారు అధిరోహించే మెట్ల అలంకరణను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. నిత్యపూజారి సత్యనారాయణ సమక్షంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం గురుస్వామి చక్రి ఆలపించిన అయ్యప్పస్వామి భక్తిగీతాలు భక్తులను అలరించాయి. పూజాధికాల అనంతరం 250 మంది స్వాములు అల్పాహారం స్వీకరించారు. ఈ పడిపూజలో మాలదారులు రాజ్‌కుమార్, ప్రసాద్, హనుమాన్, రమేష్‌వర్మ, శ్రీనివాస్, సత్యనారాయణ, నాగు, పల్లారావు, గాదె నాని, వెంకట్, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



తణుకు మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న క్లాప్ డ్రైవర్లు

తణుకు: తమ సమస్యలు పరిష్కరించాలంటూ తణుకు మున్సిపల్ పరిధిలోని క్లాప్ డ్రైవర్లు చేపట్టిన ఆందోళన మూడోరోజు బుధవారం కొనసాగించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్లాప్ డ్రైవర్లు అభద్రకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను గుర్తు పెట్టుకుని అమలు చేయాలని కోరారు. క్లాప్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, గణేష్, కేశవరావు, తాతారావు, నాని, రాంబాబు, శేఖర్, హరి, సుధాకర్, యల్లారావు, చిన్నా, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపును గ్లకోమా కబళిస్తోంది



శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు టి.రవీంద్రతో నిట్ సిబ్బంది

తాడేపల్లిగూడెం: కంటి చూపును కబళించే ప్రమాదకర వ్యాధి గ్లకోమా అని విశాఖపట్టణానికి చెందిన శంకర్ కంటి ఆస్పత్రి సీక్యూఐ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ టి.రవీంద్ర తెలిపారు. ఏపి నిట్ ఇటీవల ఈ ఆసుపత్రితో ఎంఓయు చేసుకుంది. దీనిలో భాగంగా నిట్‌లో బుధవారం గ్లకోమా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ గ్లకోమా వ్యాధి అత్యంత ప్రమాదకరమైందన్నారు. ఈ వ్యాధితో దేశంలో ఎంతో మంది బాధపడుతున్నారన్నారన్నారు. గ్లకోమా వ్యాధి సోకితే కంటి చూపును దూరం చేస్తుందన్నారు. కంటి సమస్యలను ఎవ్వరూ నిర్లక్ష్యం చేయవద్దన్నారు. తరచు వైద్యులను సంప్రదించి కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్లకోమా వాధ్యిని మొదట్లో గుర్తిస్తే , వ్యాధి తీవ్రతరం కాకుండా తీసుకోవాల్సిన చికిత్స విధానం, నివారణ పద్ధతుల గురించి వివరించారు. రెటీనా కన్సల్టెంటు డాక్టర్ అజయ్‌శర్మ మాట్లాడుతూ డయాబెటిక్ రెటినోపతి గురించి వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీన్‌లు జీఆర్‌కె.శాస్త్రి, ఎస్.జయరామ్, కార్తీక్ శేషాద్రి, డాక్టర్ హిమబిందు, నగేష్ భట్టు, వి.సందీప్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామదర్శిని



కోనాలలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు టౌన్: గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ దర్శిని కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. బుధవారం తణుకు రూరల్ మండలం కోనాల గ్రామంలో నిర్వహించిన గ్రామ దర్శిని కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నూరు శాతం రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు ప్రణాళిక ప్రకారం పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. గ్రామ ప్రాంతాల్లోని జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు వారానికి 6 రోజులు పని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి ఇంటికి మంచి నీటి కుళాయి అందిస్తామని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు పీ మోహనరావు, మాజీ సర్పంచ్ బూరుగుపల్లి ఆనంద రమేష్, ఎంపీటీసీ సత్యనారాయణ, వివిద శాఖ అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలు మేరకు డిసెంబరు 14వ తేదీన 2వ శనివారం రోజున స్థానిక కోర్టుల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్, మోటారు వాహనాలు, ప్రమాద బీమా కేసులు, బ్యాంక్ కేసుల, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించనున్నట్లు, ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు.